Tholi Aksharam.com

# తొలి అక్షరం

మా అక్షరమే మీ ఆయుధం

## తెలుగు దినపత్రిక

ఎడిటర్ : పి. సైదులు, సంపుటి : 01 సంచిక : 166 మంగళవారం 30-04-2024 పేజీలు : 5



## విలేకరులు కావలెను

### తొలి అక్షరం తెలుగు దినపత్రిక

వినూత్నంగా వెలువడుతూ, విశేష ప్రజాదరణ పొందుతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రికకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో విలేకరులు కావలెను.ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాను tholiaksharam@gmail.comకి మెయిల్ చేయగలరు.

సీనియర్లు కు ప్రాధాన్యం- కొత్తవారికి కూడా అవకాశం.

నియామకాలు జరుగుతున్నాయి వెంటనే సంప్రదించండి.


# మన ఓట్లు, సీట్లు కావాలి.. మన ఇక్కట్లు పట్టవా?

**హైదరాబాద్: ఈసారి కేంద్రంలో ఏర్పడేది సంకీర్ణ ప్రభుత్వమేనని, దాంట్లో కీలక పాత్ర పోషించేది బీఆర్ఎస్సేనని ఆ పార్టీ అధినేత కేసీఆర్ స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి 200 సీట్లు కూడా దాటే పరిస్థితి లేదని, యావత్ ప్రపంచం ఇదే విషయమై కోడై కూస్తున్నదని పేర్కొన్నారు. బీజేపీకి 370 స్థానాలు, ఎన్డీఏకు 400 సీట్లు వస్తాయనడం ఉత్తమాటేనని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఖమ్మంలో నిర్వహించిన రోడ్‌షోలో కేసీఆర్ మాట్లాడుతూ.. ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావును గెలిపిస్తే కేంద్రంలో ఏర్పడబోయే సంకీర్ణ ప్రభుత్వంలో మంత్రి అవుతారని చెప్పారు. తెలంగాణ ఓ దశలో పంజాబ్‌ను తలదన్నేలా మూడున్నర కోట్ల టన్నుల ధాన్యం పండిస్తే కేంద్రం కొనకుండా మొండికేసిందని గుర్తుచేశారు.**

**అప్పుడు బీఆర్ఎస్ పార్లమెంటరీ పక్షనేతగా ఉన్న నామా నాగేశ్వరరావు నాయకత్వంలో ఎంపీలు ఢిల్లీ వెళ్లి వడ్లు కొనాలని కోరితే తెలంగాణ ప్రజలను నూకలు తినాలని కేంద్రమంత్రి సూచించారని ఆవేదన వ్యక్తం చేశారు.**

అప్పుడు తెలంగాణ క్యాబినెట్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఢిల్లీ వెళ్లి ధర్నా చేశారని గుర్తుచేశారు. అప్పుడు ఒక్క బీజేపీ ఎంపీగానీ, ఒక్క కాంగ్రెస్ ఎంపీగానీ నోరు తెరవలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి తెలంగాణ ప్రజల ఓట్లు కావాలి కానీ, రైతుల సమస్యలు పట్టవని మండిపడ్డారు.

రాష్ట్ర సమస్యలు పట్టని దద్దమ్మలు?

గోదావరి నదిని ఎత్తుకెళ్లి తమిళనాడు, కర్ణాటకకు నీళ్లిస్తామని ప్రధాని మోదీ స్పష్టంగా చెప్తున్నా 'కిషన్‌రెడ్డి కానీ, రేవంత్‌రెడ్డి కానీ మాట్లాడుతున్నరా?' అన్న ప్రశ్నకు ప్రజలు 'లేదు.. లేదు' అని సమాధానమిచ్చారు. 'మరి ఈ దద్దమ్మలు మనకెందుకు?' అని ప్రశ్నించారు. 75 ఏండ్లపాటు రాష్ట్రంలో నీటి ఇబ్బందులను ఎవరూ పట్టించుకోలేదని విమర్శించారు. కృష్ణాలో నీరు లేనప్పుడు పంటలు ఎండిపోతున్నాయని, నాగార్జునసాగర్ ఆయకట్టులో సైతం ఇబ్బందులు వస్తున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రానికి ఉన్న ఒకే ఒక ఆశ గోదావరినదేనని స్పష్టం చేశారు.

ఖమ్మం జిల్లా ఇబ్బందులు శాశ్వతంగా తీరాలని దుమ్ముగూడెం వద్ద సీతారామ ప్రాజక్టు నిర్మాణం చేపట్టామని, 37 టీఎంసీల సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు పూర్తయితే ఖమ్మం జిల్లాలో ఒక్క అంగుళం కూడా మిగలకుండా నీరు పారుతుందని వివరించారు. ఇచ్చంపల్లి వద్ద ప్రాజెక్టు నిర్మించి తమిళనాడు, కర్ణాటకకు నీళ్లు తరలిస్తాని మోదీ అంటుంటే రేవంత్‌రెడ్డి, నాయకులు ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. 'నేను సీఎంగా ఉన్న సమయంలో నరేంద్రమోదీ ఇదే ప్రతిపాదన పెట్టిండు. ఎట్టి పరిస్థితుల్లో మా రాష్ట్రానికి వచ్చే నీళ్ల లెక్క తేల్చేదాకా, మా వాటా మాకు పెట్టేదాకా తల తెగిపడ్డా సరే ఒప్పుకోను అని చెప్పిన. అది బీఆర్ఎస్ పార్టీ పాలసీ' అని వివరించారు.తాను ఆరు రోజులుగా పర్యటిస్తున్నానని, ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని కేసీఆర్ చెప్పారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ 12 స్థానాల్లో గెలవబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. నామాను గెలిపిస్తే కేంద్రంలో ఏర్పడే సంకీర్ణ ప్రభుత్వంలో మంత్రి అవుతారని, అప్పుడు రాష్ట్రానికి, ఖమ్మం జిల్లాకు మేలు జరుగుతుందని, ఈ అవకాశాన్ని వదులుకోవద్దని విజ్ఞప్తి చేశారు. 'నరేంద్రమోదీ దాడి నుంచి, చేతగాని.. చేవలేని కాంగ్రెస్ నుంచి మన గోదావరి, కృష్ణా నదులను రక్షించుకోవాలన్నా, మన నిధులను మనం తెచ్చుకోవాలన్నా, మన హామీలను, మన హక్కులను సాధించుకోవాలన్నా బీఆర్ఎస్ అయితేనే పేగులు తెగేదాకా కొట్లాడుతది' అని స్పష్టం చేశారు. తెలంగాణ కోసం తాను



ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుంటే అరెస్ట్ చేసి ఖమ్మం జైలులోనే పెట్టారని గుర్తుచేశారు. నాడు ఖమ్మం బిడ్డలు, న్యూడెమోక్రసీ, కమ్యూనిస్ట్ విద్యార్థి బృందాలు, తెలంగాణవాదులు తనకు బ్రహ్మరథం పట్టి ఆశీర్వదించారని తెలిపారు.ఆ ఘటనను తాను ఎన్నటికీ మర్చిపోలేని పేర్కొన్నారు. 'తెలంగాణ వచ్చాక, కుల, మత, జాతి ప్రసక్తి లేకుండా అన్ని వర్గాల ప్రజలను కడుపులో పెట్టుకొని సాదుకున్నం. రైతులకు పెట్టుబడి సాయం అందించినం. రైతుబీమా కల్పించినం. 24 గంటలు రెప్పపాటు కూడా పోకుండా కరెంటు సరఫరా కల్పించినం. 7,500 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతుల పంటలను కొన్నం. దళారులు లేకుండా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేసినం' అని గుర్తు చేశారు.అబద్ధాలు చెప్పి, అడ్డగోలు హామీలు ఇచ్చి, ప్రజలను బురిడీ కొట్టించి గద్దెకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని కేసీఆర్ ఆరోపించారు. 'రూ.2,500 ప్రతి మహిళలకు ఇస్తామన్నరు వచ్చిందా?' అని కేసీఆర్ అడిగితే.. 'లేదు' అని ప్రజలు చేతులుపైకెత్తారు. 'ఇక వచ్చే ఆశ ఉన్నదా?' అని అడగ్గా 'లేదు' అని సమాధానం వచ్చింది.ఇదే అంశంపై శాసనసభలో, బయట బీఆర్ఎస్ ప్రశ్నిస్తే 'నేను జానారెడ్డిని కాదు.. నేను ఫలానా కాదు, కేసీఆర్ గుడ్లు పీకి గోళీలు ఆడుకుంటా, నిన్ను పండబెట్టి తొక్కుతా, నిన్ను చర్లపల్లి జైలుల్లో వేస్తా, నీ పేగులు తీసి మెడలో వేసుకుంటా' అని ముఖ్యమంత్రి దుర్భాషలాడుతున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. 'తెలంగాణను పాలించిన నన్ను జైలులో వేస్తానని రేవంత్ అంటుండు. జైలులో వేస్తానంటే కేసీఆర్ భయపడతడా? జైళ్లకు నేను భయపడతనా? భయపడితే తెలంగాణ వచ్చేదా?' అని ప్రశ్నించారు.

510 అడుగుల నీళ్లున్నా ఎందుకిస్తలేవ్?

తాను సీఎంగా ఉన్నప్పుడు నాగార్జునసాగర్‌లో 495 అడుగుల నీళ్లు ఉన్నా నల్లగొండ, ఖమ్మంలోని పంటలకు నీళ్లు ఇప్పించినట్టు కేసీఆర్ తెలిపారు. ఒక్కసారి కూడా పంటలు ఎండిపోనివ్వలేదని పేర్కొన్నారు. పాలేరు ఎప్పుడూ మత్తడి దుంకేదని గుర్తుచేశారు. ఇప్పుడు 510 అడుగులకు నీళ్లు ఉన్నా, తాను హెచ్చరించినా పంటలు ఎండబెట్టారే కానీ నీళ్లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేలకొండపల్లి మండలంలో పంటలు మొత్తం ఎండిపోయాయని మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి చెప్పినట్టు తెలిపారు. భక్తరామదాసుకు ఏమైందని? అంత బ్రహ్మాండమైన ప్రాజెక్టు కట్టినా పంటలు ఎలా ఎండాయని అడిగితే, పాలేరు కూడా ఎండబెట్టారని, కరెంటు కూడా ఇస్తలేరని ఎన్నో పంటలు ఎండిపోయాయని తన దృష్టికి తీసుకొచ్చినట్టు వివరించారు.

డిసెంబర్ 9న ఉదయం 10 గంటలకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించారని, మరి అయిందా? అని కేసీఆర్ రోడ్‌షోకు హాజరైన వారిని ప్రశ్నించారు. దానికి వారు 'కాలేదు..కాలేదు' అని సమాధానమిచ్చారు. రుణమాఫీ చేయకపోగా భద్రాద్రి రామయ్య, బాసర సరస్వతి, యాదగిరి నర్సింహస్వామి మీద ఒట్లు పెడుతున్నాడని, 'ఇంకా ఎన్ని ఒట్లు పెడతావ్ ముఖ్యమంత్రీ' అని నిలదీశారు. ఇదే అంశంపై ఆగస్టు 15 లోగా రుణమాఫీ చేయాలని హరీశ్‌రావు రాజీనామా పత్రం ఇచ్చాడని తెలిపారు. 'రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేయకపోతే రాజీనామా చేయాలని హరీశ్ డిమాండ్ చేసిండు. కానీ ముఖ్యమంత్రి గన్‌పార్క్‌కు పోలేదు. తోకముడిసిండు' అని కేసీఆర్ ఎద్దేవా చేశారు.ఖమ్మం రోడ్‌షో కోసం వెళ్తూ మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజీ వద్ద కేసీఆర్ కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, మహిళలతో మాట్లాడిన కేసీఆర్ 'రైతుబంధు వచ్చిందా' అని అడిగారు. 'నాకు మూడెకరాలున్నాయి. రెండెకరాలల్ల వరి వేస్తే నీళ్లు రాక ఎకరం ఎండిపోయింది. కాల్వలో వారం రోజులే నీళ్లిచ్చింండ్రు. మార్చి మధ్యలనే ఆపడంతో పొలం ఎండిపోయింది' అని గుగులోత్ జ్యోతి ఆవేదన వ్యక్తంచేసింది.కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా కేసీఆర్ కేవలం రూ. లక్ష మాత్రమే ఇస్తున్నడు, తాము అధికారంలోకి వస్తే తులం బంగారం కూడా ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి నమ్మబలికారని, 'మరి తులం బంగారం ఎవరికైనా వచ్చిందా?' అని కేసీఆర్ ప్రశ్నించగా, 'రాలే.. రాలే' అంటూ ప్రజల నుంచి సమాధానం వచ్చింది. రైతుబంధు గురించి అడిగితే ఓ కాంగ్రెస్ మంత్రి అహంకారంతో మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# చంద్రబాబు పుడింగి అయితే..పొత్తులెందుకు?



**పొన్నూరు ప్రచార సభలో సీఎం వైయస్ జగన్**

**ఇంటింటికి మంచి చేసిన మీ బిడ్డ వైయస్ జగన్ ఒక్కడే ఒకవైపు**

**మోసం చేసిన దుష్టచతుష్టయం మరోవైపు**

**నన్ను ఎదుర్కోవడానికి ఇన్ని పార్టీలతో పొత్తు అవసరమా..?**

**ఈ ఎన్నికలు రాబోయే ఐదేళ్ల భవిష్యత్**

**జగన్‌కు ఓటు వేస్తే పథకాలన్నీ కొనసాగింపు**

**పొరపాటున బాబుకు ఓటేస్తే..పథకాలన్నీ ముగింపే**

పొన్నూరు: చంద్రబాబు పుడింగి అయితే..పొత్తులెందుకని సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. చంద్రబాబు నన్ను బచ్చా అంటున్నాడు..పోయే కాలం వచ్చినప్పుడు విలన్లకు హీరో బచ్చానే. ఈ బచ్చానే ప్రతి ఇంటికి మంచి చేసి ఓట్లు అడుగుతున్నాడు. 14 ఏళ్ల సీఎంగా పని చేసిన చంద్రబాబు ఒక్క మంచి అయినా చేశాడా అని ప్రశ్నించారు. నన్ను ఎదుర్కోవడానికి ఇన్ని పార్టీలతో పొత్తు అవసరమా..? అని నిలదీశారు. వాలంటీర్ వ్యవస్థ, రైతు భరోసా, నాడు నేడు , వంటి కార్యక్రమాలతో తాను ప్రజల్లో మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నానని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు.

పొన్నూరు సభలో సీఎం వైయస్ జగన్ ప్రసంగించారు. పొన్నూరు సిద్ధమా?.. ఇంత మండుటెండలో కూడా ఇంతటి అభిమానం చూపిస్తూ చిక్కటి చిరునవ్వుల మధ్య ప్రేమానురాగాలు పంచి పెడుతున్న నా ప్రతి అక్కకూ, ప్రతి చెల్లెమ్మకూ, నా ప్రతి అవ్వకూ, ప్రతి తాతకూ, నా ప్రతి సోదరుడికీ, ప్రతి స్నేహితుడికీ ముందుగా మీ జగన్.. మీ బిడ్డ రెండు చేతులూ జోడించి పేరు పేరునా హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాడు. మరో రెండు వారాల్లో కురుక్షేత్ర మహాసంగ్రామం జరగబోతోంది. ఈ యుద్ధంలో అటువైపున ఉన్నది కౌరవ సైన్యం. దుష్ట చతుష్టయం. అటు గతంలో వాళ్లు ప్రభుత్వంలో ఉన్నప్పుడు అందరినీ మోసం చేసిన చరిత్ర ఆ కూటమిది. అటు చంద్రబాబు, ఆయనకు మద్దతుగా రెండు జాతీయ పార్టీలు, ఒక వదినమ్మ, ఒక దత్తపుత్రుడు, ఒక ఈనాడు, ఒక ఆంధ్రజ్యోతి, ఒక టీవీ5.. వీరందరూ సరిపోరు అన్నట్టుగా వీరి కుట్రలు, కుతంత్రాలు, మోసాలు, అబద్ధాలు.. వీళ్లందరితో కూడా ఈరోజు యుద్ధం చేస్తున్నాం.

# తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఢిల్లీ పోలీసుల నోటీసులు

**- రిజర్వేషన్ల అంశం మీద అమిత్ షా ఫేక్ వీడియో వైరల్‌గా మారిందని బీజేపీ ఫిర్యాదు**

**- కాంగ్రెస్ నేతలే ఆ ఫేక్ వీడియోను క్రియేట్ చేశారని ఫిర్యాదు - పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డికి ఢిల్లీ పోలీసుల నోటీసులు**

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫేక్ వీడియోపై వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. మే 1వ తేదీకల్లా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. రిజర్వేషన్ల అంశం మీద అమిత్ షాపై కాంగ్రెస్ నేతలే ఫేక్ వీడియోను క్రియేట్ చేశారని బీజేపీ నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డికి నోటీసులు ఇచ్చారు. ఢిల్లీ నుంచి వచ్చిన పోలీసులు గాంధీ భవన్‌కు వెళ్లారు. మే 1న ఫోన్ తీసుకొని విచారణకు రావాలని పోలీసులు తెలిపారు. అమిత్ షా మార్ఫింగ్ వీడియోను రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా పోస్ట్ చేసినట్లు ఢిల్లీ పోలీసులు చెబుతున్నారు.రిజర్వేషన్లు రద్దు చేస్తున్నారని అమిత్ షా చెప్పినట్లుగా ఓ ఫేక్ వీడియోను కాంగ్రెస్ పార్టీ వైరల్ చేస్తోందని ఢిల్లీ, హైదరాబాద్‌తో పాటు పలురాష్ట్రాల్లో బీజేపీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డికి సమన్లు జారీ చేశారు. వీడియో షేర్ చేశారంటూ పలువురు కాంగ్రెస్ నేతలకు కూడా ఢిల్లీ పోలీసులు సమన్లు జారీ చేశారు. రేవంత్ రెడ్డితో పాటు పలు రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ట్విట్టర్ హ్యాండిల్స్‌కు నోటీసులు జారీ చేశారు.ఈ ఫేక్ వీడియోను ఎవరు



తయారు చేశారన్న దానిపై స్పెషల్ సెల్ ఇంటెలిజెన్స్ దర్యాప్తు చేపట్టింది. ఈ ఫేక్ వీడియోలు ఝార్ఖండ్‌తో పాటు తెలంగాణ కాంగ్రెస్ ట్విట్టర్ హ్యాండిల్స్ ద్వారా బయటకు వచ్చినట్లు పోలీసులు గుర్తించారని తెలుస్తోంది. డీప్ ఫేక్ వీడియోలు చేసిన వారికి తగిన బుద్ధి చెబుతామని ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు.

# 104 కోట్ల విలువైన నగదు, బంగారం పట్టివేత

**- తనిఖీల్లో 104 కోట్ల నగదు, బంగారం పట్టివేత**

**- ఎన్నికల నేపథ్యంతో 89 చెక్ పోస్ట్ లు ఏర్పాటు**

**- 42 రోజుల సోదాలలో భారీగా మద్యం, నగదు పట్టివేత**

**- 29 కోట్ల ఆభరణాలు స్వాధీనం**

**- రూ.5 కోట్ల విలువైన మద్యం సీజ్**

హైదరాబాద్ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో భారీగా నగదు, మద్యం, డ్రగ్స్ పట్టుబడుతున్నాయి. మార్చి 16 నుంచి ఏప్రిల్ 28 వరకు రూ.104.18 కోట్లను తనిఖీ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 477 ఎఫ్ఎస్టీ, 464 ఎస్ఎస్టీ బృందాలు 89 సరిహద్దు చెక్పోస్టుల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం, డ్రగ్స్, ఉచితాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో రూ.63.18 కోట్ల నగదు ఇప్పటికే దొరకడం కలకలం సృష్టిస్తున్నది. ఇక రూ.5.38 కోట్ల విలువైన మద్యం, రూ.7.12 కోట్ల విలువైన డ్రగ్స్,



రూ.21.34 కోట్ల విలువైన ఆభరణాలు, రూ.6.91 కోట్ల విలువైన ఇతర వస్తువులును స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7,174 లైసెన్స్ ఆయుధాలను పోలీసులకు డిపాజిట్ చేశారు. అనధికారికంగా వెంటపెట్టుకొన్న 14 ఆయుధాలను సీజ్ చేశారు. జిలిటెన్స్టిక్స్, డిటోనేటర్లు, కార్టన్ బాక్స్ వంటి పలు పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

# నేడు తెలంగాణ పదో తరగతి ఫలితాలు



# ఎండలతో జాగ్రత్త.. అవసరమైతేనే బయటకు రండీ-మంత్రి సీతక్క



హైదరాబాద్: సూర్యడు తన ఉగ్ర రూపాన్ని చూపుతున్నాడని.. ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని మంత్రి సీతక్క సూచించారు. ఇవాళ ఆమె వరంగల్ జిల్లాలో లోకసభ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయని.. ఆవసరమైతెనే ఇండ్ల నుంచి బయటకు రావాలని సీతక్క ప్రజలకు తెలిపారు. కూలీ పనులకు వెళ్ళే వారు త్వరగా పని ముగించుకుని ఇంటికి చేరుకోవాలని చెప్పారు గోదావరి పరివాహక ప్రాంతంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని ప్రజలంతా మరింత జాగ్రత్తలు పాటించాలని మంత్రి చెప్పారు. పెరగుతున్న ఉష్ణోగ్రతలు.. వృద్ధులు, చిన్న పిల్లలపైన తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నందున తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# నేడు తెలంగాణ పదో తరగతి ఫలితాలు

**నేడు ఉదయం 11 గంటలకు పదో తరగతి ఫలితాల విడుదల**

**పరీక్షలకు హాజరైన 5.08 లక్షల మంది విద్యార్థులు**

**ఫలితాల విడుదలకు ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్**

తెలంగాణలో 10వ తరగతి పరీక్షా ఫలితాలు రేపు విడుదల కాబోతున్నాయి. టెన్త్ రిజల్ట్స్ ను రేపు విడుదల చేయడానికి విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రేపు ఉదయం 11 గంటలకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఫలితాలను విడుదల చేయనున్నారు. ఫలితాలు ఆన్ లైన్ లో విడుదల కాబోతున్నాయి. పదో తరగతి పరీక్షా ఫలితాలకు విడుదల చేసేందుకు ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి పరీక్షలు జరిగాయి. దాదాపు 5.08 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో 2,50,433 మంది బాలికలు... 2,57,952 మంది బాలురు పరీక్షలకు హాజరయ్యారు. జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ ఏప్రిల్ 13 నాటికి పూర్తయింది. పదో తరగతి పరీక్షల ఫలితాలను బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్ సైట్ https://results.bsetelangana.org లో చెక్ చేసుకోవచ్చు.

# సుడిగాలులతో అమెరికాలో అల్లకల్లోలం!

**- ఓక్లహోమా రాష్ట్రంలో టోర్నడోల బీభత్సం - హోల్డెన్‌విల్ టౌన్‌లో గంటల వ్యవధిలో రెండు టోర్నడోల కలకలం**

**- అనేక ఇళ్లు నేలమట్టం, 4 నెలల చిన్నారి సహా ఇద్దరి మృతి - ఓక్లహోమాలో 30 రోజుల ఎమర్జెన్సీ ప్రకటించిన గవర్నర్**



వరుస సుడిగాలులతో అమెరికాలోని పలు రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయి. శుక్రవారం 78 టోర్నడోల బీభత్సం తరువాత మరో 35 టోర్నడోలు నిన్న విరుచుకుపడ్డాయి. ఓక్లహోమా రాష్ట్రంలోని హోల్డన్‌విల్ అనే టౌన్‌లో రెండు టోర్నడోలు గంటల వ్యవధిలో విలయం సృష్టించాయి. ఈ క్రమంలో నాలుగు నెలల చిన్నారి సహా ఇద్దరు మృత్యువాత పడ్డారు. అనేక ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఓక్లహోమాతో పాటు టెక్సాస్, నెబ్రాస్కా, కాన్సాస్, మిస్సోరీ రాష్ట్రాల్లోనూ సుడిగాలుల ప్రభావం కనిపించింది. ఓక్లహోమా రాష్ట్రంలో టోర్నడోల కారణంగా కొన్ని ప్రాంతాల్లో గంటల వ్యవధిలోనే 18 సెంటీమీటర్ల వర్షపాతం కురిసింది. ఆకస్మిక వరదలు, హిమపాతానికి కూడా అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఓక్లహోమాలోని సల్ఫర్ అనే టౌన్‌లో పలు భవనాలు నేలమట్టమయ్యాయి. వాహనాలు తిరగబడ్డాయి. అనేక చెట్లు నేలకొరిగాయి. అత్యవసర సిబ్బంది మినహా సామాన్య పౌరులెవ్వరూ తమ టౌన్‌కు రావద్దని ముర్రే కౌంటీ షరిఫ్ (పోలీసు అధికారి) సోషల్ మీడియాలో విజ్ఞప్తి చేశారు. టోర్నడోల బీభత్సం దృష్ట్యా ఓక్లహోమాలో రాష్ట్ర గవర్నర్ 30 రోజుల పాటు ఎమర్జెన్సీ ప్రకటించారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం, టెక్సాస్‌లో టోర్నడోల కారణంగా 50 వేల ఇళ్లు, ఓక్లమోమాలోని 30 వేల ఇళ్లకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. అమెరికాలో మిడ్ వెస్ట్‌గా పిలిచే పలు రాష్ట్రాల్లో టోర్నడోలు ఎక్కువగా వస్తుంటాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతుంటారు. అయితే, రోజుల వ్యవధిలో రెండుసార్లు సుడిగాలులు ఇలా బీభత్సం సృష్టించడం చాలా అరుదైన విషయమని అంటున్నారు.

# ఏపీ, తెలంగాణలో భానుడి భగభగ

**- 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు - ఉదయం 9 దాటితే నిప్పుల కుంపటే సాయంత్రం 7 దాటిన తగ్గని వేడి వేడిగాలులకు జనం విలవిల**

**- ఉక్కబోతకు ఉక్కిరిబిక్కిరి బయట కాలు పెట్టని జనం - అవసరమైతేనే బయటకు నిర్మానుష్యంగా రోడ్లు రెడ్ వార్నింగ్ ఇచ్చిన వాతావరణ శాఖ**



హైదరాబాద్ :ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో రికార్డు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు రాయలసీమ, తెలంగాణ జిల్లాల్లో రికార్డు అయ్యాయి. తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ రెండ్ వార్నింగ్ ఇచ్చింది. రానున్న మూడు రోజుల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తీవ్రమైన ఎండలకు తోడు వడగాల్పులు వీస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరిస్తోంది. మీరు ఇళ్ల నుంచి బయటికి వెళ్తున్నారా? బీ కేర్‌ఫుల్!. అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి కాలు బయటపెట్టకండి. ఎందుకంటే, తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ రెడ్ వార్నింగ్ ఇచ్చింది. మరో 3 రోజులపాటు ఎండలు మండిపోతున్నాయని హెచ్చరించింది ఐఎండీ.. తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచి కొడుతున్నాయి. ఎండ వేడికి జనాలు ఒక్కరి బిక్కిరి అవుతున్నారు. ఏప్రిల్ నెల నుంచి కొన్ని జిల్లాల్లో 40 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. తీవ్రమైన ఎండలకు తోడు వడగాల్పులు వీస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరిస్తోంది.దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు తెలంగాణలో నమోదవుతున్నాయి. శుక్రవారం దాదాపు 8 జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలు దాటింది. గత పదేళ్లలో ఏప్రిల్ నెల చివరి వారంలో ఒకేసారి ఇన్ని కేంద్రాల్లో ఈస్థాయి ఎండలు చూడటం ఇదే తొలిసారి. 45 డిగ్రీలు దాటిన కరీంనగర్, ములుగు, నల్గొండ, జగిత్యాల, యాదాద్రి, వరంగల్, వనపర్తి జిల్లాలకు వాతావరణశాఖ అధికారులు రెడ్ వార్నింగ్ జారీ చేశారు. తెలంగాణలో మరో మూడు రోజులపాటు ఎండలు మండిపోనున్నాయి. వృద్ధులు, పిల్లలు, వీధి వ్యాపారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణశాఖ అధికారులు సూచించారు. వీలయినంతవరకూ ఓర్ఎస్, చలువ చేసే ఇతర జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ఏపీలోనూ భానుడి ప్రతాపం రోజురోజుకూ పెరుగుతోంది. ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వడగాలులు కొనసాగుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు వడగాల్పులతో జనం అల్లాడిపోతున్నారు. ఇవాళ 58 మండలాల్లో తీవ్రవడగాల్పులు, 148 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఏపీలోని 8 జిల్లాలోని 61 మండలాల్లో వాతావరణ శాఖ అలర్ట్ ప్రకటించింది.ఇక నిన్న ఏపీలోని నంద్యాలజిల్లా చాగలమర్రిలో 45.9 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. తిరుపతిజిల్లా రేణిగుంటలో 45.7, కడపజిల్లా ఖాజీపేట, పార్వతీపురంమన్యం జిల్లా సాలూరులో 45.7, విజయనగరంజిల్లా గజపతినగరం, కర్నూలుజిల్లా కోడుమూరులో 44.8, అనంతపురంజిల్లా తాడిపత్రిలో 44.4, పల్నాడుజిల్లా మాచెర్లలో 44.2 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ వెల్లడించింది. ప్రజలు వీలైనంతవరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంట్లోనే ఉండాలని విపత్తుల సంస్థ అధికారులు సూచించారు. వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# వేల వేల పోతున్న ఆకేరు వాగు

**వేల వేల పోతున్న ఆకేరు వాగు**

**-ఆకేరుకు..మిగిలింది కన్నీరు**



**తొలి అక్షరం/నర్సింహులపేట,ఏప్రిల్29:** నర్సింహులపేట మండలం లోని కౌసల్యాదేపల్లి వద్ద గల గల పారే ఆకేరు నేడు నీళ్లు లేక రాళ్లు తేలి వెలవెలబోతోంది.రైతన్నలకు కంట నీరు పెట్టిస్తోంది.గత వానాకాలంలో ఆకేరు మునుపెన్నడూ లేని విధంగా పొంగి పొర్లింది.యాసంగి వచ్చేసరికి చుక్క నీరు లేకుండా అడుగంటిపోయింది.మహబూబాబాద్ జిల్లా లోని చిన్నగూడూరు,నర్సింహులపేట మండలం కౌసల్యాదేవిపల్లి శివారులోని ఆకేరు వాగు ప్రస్తుత పరిస్థితి ఇది.వాగులో బిగించిన 1000కి పైగా మోటార్లు నిరుపయోగంగా ఉన్నాయి.గతంలో ఎగువ నుంచి ఎస్సారెస్పీ,కాళేశ్వరం నీళ్లు కాలువల ద్వారా ఆకేరు లోకి వచ్చేవి.ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో చుక్క నీరు లేకుండా పోయింది.దీంతో వాగు ఆధారంగా సాగు చేసిన యాసంగి పంటలన్నీ ఎండిపోయి పశువులకు మేతగా మారాయి.దీనికి తోడు ఆకేరు వాగులో ఇసుక తీయడంవలన నీళ్ల లేకపోవడం వలన రైతులు ఆందోళన చెందుతున్నారు.

# మోడీని అనర్హునిగా ప్రకటించాలంటూ దాఖలైన పిటిషన్‌న తిరస్కృతి



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీని ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హునిగా ప్రకటించాలంటూ దాఖలైన వినతిని ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. ఉత్తర్ ప్రదేశ్ లోని పిలిభిత్ లో ఇటీవల ఇచ్చిన ప్రసంగంలో దేవుడు, మందిరం పేరిట ఆయన ఓట్లు కోరి, ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని పేర్కొంటూ ఆయనపై అనర్హత వేటేయాలని వినతిలో పేర్కొన్నారు.అర్జీదారుడి విషయాన్ని ఎన్నికల సంఘం చూడాల్సి ఉండగా ఆయన కోర్టును ఆశ్రయించడం పూర్తిగా దురుద్దేశంతో కూడిందని కోర్టు అభిప్రాయపడింది. న్యాయమూర్తి సచిన్ దత్తా ఆయన వినతిని కొట్టివేశారు.ఇటీవల రాజస్థాన్ లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ ముస్లింలను 'చొరబాటుదారులు' అనడానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఇటీవల ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. "తల్లులు, సోదరీమణుల బంగారం లెక్కలేసి, సంపద సమాచారాన్ని సేకరించి, దానిని పున:పంపిణీ చేస్తానని కాంగ్రెస్ మేనిఫెస్టో పేర్కొంది. వారు ఎవరికి పున:పంపిణీ చేస్తారు? ఇదివరలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం దేశ సంపదపై ముస్లింలదే ప్రధాన హక్కు అని అన్నారు" అని మోడీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. 'మీ కష్టార్జితం చొరబాటుదారులకు పోవాలా? దానిని మీరు ఆమోదిస్తారా?' అని కూడా మోడీ ప్రసంగంలో ప్రశ్నించారు. దీనిపై ఎన్నికల సంఘం బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డాకు నోటీసులు జారీ చేసింది. స్టార్ ప్రచారకులు తమ ప్రసంగంలో సంయమనం పాటించాలని పేర్కొంది.

## కాశ్మీర్‌లో భారీ వర్షం, హిమపాతం..

## శ్రీనగర్-లేహ్ హైవే మూసివేత.. పర్యాటకులకు హెచ్చరిక



జీలం నది, చుట్టుపక్కల నివసించే ప్రజలు, పర్యాటకులకు శ్రీనగర్ పరిపాలన అధికారులు హెచ్చరిక జారీ చేశారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసర సమయంలో వరద నియంత్రణ గది ద్వారా జారీ చేయబడిన ఫోన్ నంబర్లకు సంబంధించిన సమాచారం ఇవ్వాలి. ప్రతికూల వాతావరణం, హిమపాతం హెచ్చరిక కారణంగా కుప్వారాలో పాఠశాలలకు సెలవులు ఇచ్చారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా ముందుజాగ్రత్త చర్యగా జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు సెలవు జమ్మూకశ్మీర్‌లో భారీ వర్షం కురుస్తోంది. వరదలు వచ్చే అవకాశం ఉంది. వర్షం కారణంగా నదులు, కాలువల నీటిమట్టం పెరిగింది. అదే సమయంలో ఎగువ ప్రాంతాల్లో తెల్లవారుజామునుంచి మంచు వర్షం కురుస్తోంది. సోనామార్గ్‌లో తాజాగా కురిసిన మంచు 3 అంగుళాలకు పైగా పేరుకుంది. దీంతో శ్రీనగర్–లేహ్ జాతీయ రహదారి మూసివేశారు. అంతేకాదు జోజిలా, సాధన టాప్, రజ్దాన్ పాస్, దావర్ గురేజ్, తులైల్ గురేజ్, మచిల్, కొంగ్‌డోరి, మెయిన్ గుల్‌మార్గ్, సింథాన్ టాప్, మొఘల్ రోడ్‌లలో కూడా భారీ హిమపాతం ముంచేసింది.దకాశ్మీర్‌లో రానున్న కొన్ని రోజుల పాటు ఎక్కువ వర్షాలు, తేలికపాటి మంచు కురుస్తుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇక్కడ కొనసాగుతున్న వర్షాల కారణంగా రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం ఉదయం వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే సోమవారంతో పోలిస్తే తీవ్రత, ప్రభావం తక్కువగానే ఉండబోతోంది. కొన్ని చోట్ల ఆకస్మిక వరదలు, తీవ్రమైన వడగళ్ల వాన, బలమైన గాలులు, ఉరుములతో కూడిన జల్లులు కురుస్తాయని అధికారులు హెచ్చరించారు. మే 1వ తేదీ వరకు జమ్మూ-శ్రీనగర్ హైవేపై ప్రయాణించవద్దని ప్రజలకు అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం కాశ్మీర్‌లో వరద ముప్పు ప్రమాదం లేదని కాశ్మీర్‌లోని నీటిపారుదల, వరద నియంత్రణ (ఐ అండ్ ఎఫ్‌సి) విభాగం ప్రజలకు హామీ ఇచ్చింది. వాతావరణ పరిస్థితిని తమ డిపార్ట్‌మెంట్ చురుకుగా పర్యవేక్షిస్తున్నదని, ప్రస్తుతానికి భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. జీలం నది, ఇతర నీటి వనరులలో నీటి మట్టాన్ని గంట ప్రాతిపదికన అంచనా వేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.జీలం నది, చుట్టుపక్కల నివసించే ప్రజలు, పర్యాటకులకు శ్రీనగర్ పరిపాలన అధికారులు హెచ్చరిక జారీ చేశారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసర సమయంలో వరద నియంత్రణ గది ద్వారా జారీ చేయబడిన ఫోన్ నంబర్లకు సంబంధించిన సమాచారం ఇవ్వాలి. ప్రతికూల వాతావరణం, హిమపాతం హెచ్చరిక కారణంగా కుప్వారాలో పాఠశాలలకు సెలవులు ఇచ్చారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా ముందుజాగ్రత్త చర్యగా జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. అయితే టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది మాత్రం డ్యూటీలో ఉంటారు.అదే సమయంలో రాంబన్–గుల్ రహదారిపై ల్యాండ్ స్లైడ్లు నిరంతరం జరుగుతున్నాయి.

# తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్టస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ.



పి.సైదులు

ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

### ఇంటర్ ఫెయిలయ్యానని విద్యార్థిని ఆత్మహత్య



**తొలి అక్షరం/నర్సింహులపేట,ఏప్రిల్29:**ఇంటర్ పరీక్షలో రెండు సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన రూపులతండ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రచక్ర తండాలో చోటు చేసుకుంది. వివరాలకు వెళ్తే నర్సింహులపేట మండలంలోని రూపులతండ గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్రచక్ర తండాకు చెందిన గుగులోతు బీమాకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందులో చిన్న కుమార్తె స్వాతి (17)తొర్రూర్ లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఇటీవల వెలువడిన పరీక్షా ఫలితాల్లో రెండు సబ్జెక్టులు ఫెయిల్ అయింది. దీంతో మనస్థాపం చెంది పురుగుల మందు తాగగా విషయం తెలుసుకున్న కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ఏరియా హాస్పిటల్ కు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. దీంతో తండాలో

### మండల మైనార్టీ సెల్ అధ్యక్షులుగా ఎస్కె యాకూబ్ పాషా



**తొలి అక్షరం/పర్వతగిరి,ఏప్రిల్29:**పర్వతగిరి మండల మైనార్టీ సెల్ అధ్యక్షులుగా సోమరం గ్రామానికీ చెందినా ఎస్కె యాకూబ్ పాషా నియమిస్తూ సోమవారం వర్ధన్నపేట శాసనసభ్యులు కెఆర్ నాగరాజు నియామక పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా యాకూబ్ పాషా మాట్లాడుతూ...ప్రజల ప్రభుత్వం ఏర్పాటు తో ప్రజాలందరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. తనను మండల అధ్యక్షుడిగా నియమించినదుకు శాసనసభ్యులు కెఆర్ నాగరాజు కి అధికార ప్రతినిధి శేఖర్ రావు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్,జిల్లా ఉపాధ్యక్షులు పిన్నిటి అనిల్ రావు,జిల్లానాయకులు వెంకట్ రెడ్డి,జిల్లా నాయకులు రతన్ రావు మండల నాయకుడు వంగల రవీందర్,గ్రామ ఎంపీటీసీ సరోజన లచ్చు నాయక్,ముఖ్య నాయకులు,కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

### జన్మదిన వేడుక కు హాజరై చిన్నారిని ఆశీర్వదించిన బిఆర్ఎస్ నాయకులు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో(సాంబ),ఏప్రిల్29:**నెక్కొండ మండలకేంద్రానికి చెందిన రామారపు సుమన్-అపర్ణ దంపతుల కుమారుడు రుద్రాన్ష్ మొదటి పుట్టిన రోజు వేడుకలకు హాజరై ఆశీర్వదించిన నెక్కొండ మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సొసైటీ చైర్మన్కొమ్మారెడ్డి,రవీందర్ రెడ్డి,అడ్వకేట్ కొమ్ము రమేష్ యాదవ్. ఈ కార్యక్రమంలో దేవనబోయిన వీరభద్రయ్య, రామారపు భద్రయ్య,బండారి చిన్న,బొడ్డుపెల్లి రాజు, రామారపు వీరస్వామి,పొట్లపెల్లి రాజు,ఈదునూరి శ్రీనాథ్,బోనాల హరీష్,రామారపు ప్రశాంత్,వడ్డూరి సంపత్,బొల్లబోయిన వెంకటేష్,రామారపు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

### కుక్కల దాడిలో దుప్పి మృతి



**తొలి అక్షరం/పినపాక,ఏప్రిల్29:**కుక్కల దాడిలో దుప్పి మరణించిన ఘటన పినపాక మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే తోగ్గూడెం గ్రామానికి సమీపంలో ఉన్న పెద్దవాగు, పొట్లపల్లి గుట్ట నుండి ఊర కుక్కలు దుప్పిని తరుముకుంటూ వేటాడుతూ తోగూడెం గ్రామంలో బొడ్డు సరోజినీ వచ్చాయి. వెంటనే గమనించిన సరోజినీ కుక్కలను తరిమివేశారు. ఈ ఘటనలో దుప్పి మరణించిందని సమాచారాన్ని అటవీశాఖ అధికారులకు తెలిపినట్లు సరోజినీ తెలిపారు. వెంటనే అక్కడికి చేరుకున్న అటవీశాఖ అధికారి లక్ష్మణరావు దుప్పిని స్వాధీన పరుచుకున్నారు. పంచనామా అనంతరం అంత్యక్రియలు నిర్వహిస్తామని తెలియజేశారు.

### నూతన జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన సూరిరెడ్డి



**తొలి అక్షరం/పినపాక,ఏప్రిల్29:**మణుగూరు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు నూతన జడ్జిగా సూరిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మణుగూరు బార్ అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మణుగూరు నుండి నుండి భద్రాచలం బదిలీపై వెళ్తున్న మెజిస్ట్రేట్ మీసాల వెంకటేశ్వర్లుకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### బయ్యారం లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం



**తొలి అక్షరం/బయ్యారం,ఏప్రిల్ 29:**మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా ఇల్లందు నియోజకవర్గం శాసనసభ్యులు కోరం కనకయ్య. అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం మే 4 వ తేదీన బయ్యారం లో గాంధీ సెంటర్ లో జరుగు క్రీడామైదాణం లో సాయంత్రం 5-00 గంటలకు జరుగు బహిరంగ సభను ఉద్దేశించి నాయకుల నుండి అభిప్రాయం తీసుకొవడం జరిగింది మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బలరామ్ నాయక్ ను భారీ మెజార్టీ తో గెలిపించాలని కోరం కనకయ్య గారు అన్నారు,ఈ కార్యక్రమం లో మండల పార్టీ నాయకులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంగం నాయకులు,, మాజీ సర్పంచులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## అగ్నిప్రమాదంలో అన్నదాతకు అపార నష్టం

**-కాలి బూడిదైనా మూడేకరాల శ్రీగంధం,మొక్కజొన్న పంట**

**-రెండు వ్యవసాయ బోర్లు పూర్తిగా దగ్ధం**

**-కళ్ళముందే అగ్నికి ఆహుతైన పంటను కాపాడలేక కన్నీటి పర్యంతమైన రైతన్న**

**-సుమారు మూడు లక్షల మేర ఆస్థి నష్టం**

**-ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్న రైతులు**





**తొలిఅక్షరం/బయ్యారం,ఏప్రిల్29:**బయ్యారం మండలంలోని ఏజెన్సీ ప్రాంతమైన రెడ్యా తండ గ్రామ శివారు పంట పొలాల్లో సంభవించిన అగ్ని ప్రమాదం రైతు కంట కన్నీరు మిగిల్చింది. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట కళ్ళముందు అగ్నికి ఆహుతి అవుతుండగా కాపాడుకునే లోపే పూర్తిగా పంట కాలి బూడిదయిందని బోరున విలపిస్తున్నారు. చిన్న,సన్నకారు రైతులు ఎండకు ఎండి వానకు తడిసి తిండి,తిప్పలు లేక పంటను ప్రాణంగా పండించి ఇంటికి తీసుకోని వచ్చే దశలో ఇంతటి ఘోరం జరుగుతుందని అనుకోలేదని రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అగ్ని ప్రమాదంలో బాణోత్ భీమా అనే రైతు రెండు ఎకరాల్లో సాగు చేస్తున్న శ్రీ గంధం మొక్కల తో పాటుగా మరో రైతు బాణోత్ రాంకోటికి చెందిన మూడు ఎకరాల మొక్కజొన్న పంట అగ్ని కి పూర్తిగా ఆహుతి అయ్యిందని ఆవేదన వ్యక్తంచేశారు. వీటితో పాటుగా రెండు వ్యవసాయ బోర్లు పూర్తిగా దగ్ధం అయ్యాయి. సుమారు మూడు లక్షల మేర ఆస్థి నష్టం జరిగిందని బాధిత రైతులు అంటున్నారు. కష్ట పడి పండించిన పంట అగ్నికి ఆహుతి అవ్వడంతో బాధిత రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి తమను ఆదుకోవాలని రైతన్నలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే దిశగా అందరూ బాధ్యతగా ఓటు వేయాలి

**-నిజాయితీగా బాధ్యతగా ఓటు వేద్దాం**

**-ఓటు వజ్రాయుధం లాంటిది**

**-ప్రజల ఆలోచనా ప్రతిబింబమే ప్రభుత్వం**

**-మనకు ఎలాంటి ప్రభుత్వం కావాలో నిర్ణయించుకునేది మనమే**

**-ప్రజలు మారితేనే నాయకులు మారుతారు**

**-టిపిటిఎఫ్ ఇనుగుర్తి మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ ఉద్ఘాటన**



**తొలి అక్షరం/ఇనుగుర్తి,ఏప్రిల్29:**ఎన్నికలు జరుగుతున్న వేళ ప్రజలు ముఖ్యంగా యువకులు అప్రమత్తంగా ఉండాలని సుపరిపాలన అందించే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే దిశగా అందరూ బాధ్యతగా,నిజాయితీగా ఓటు వేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఇనుగుర్తి మండలశాఖ అధ్యక్షులు గుండు సురేందర్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అధ్యక్షులు సురేందర్ మాట్లాడుతూ...డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తన మేధాసంపత్తిని ఉపయోగించి అనేక దేశాలు పర్యటించి,పరిశీలించి మేధావులతో మేధోమదనం జరిపి ముందు చూపుతో ప్రజలకు ఓటు అనే వజ్రాయుధాన్ని ఇచ్చారని గుర్తుచేశారు. ఈ ఓటు ద్వారా మనం ఎన్నుకున్న ప్రభుత్వం,ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి దేశాన్ని గాని రాష్ట్రాన్ని గాని అభివృద్ధి బాటలో నడిపించడానికి తగిన సమయం ఇవ్వాలన్నారు. సమీక్షించడానికి మనకు కూడా మళ్ళీ అవకాశం ఇవ్వడానికి ఈ ప్రభుత్వానికి ఐదేళ్ల కాల పరిమితిని విధించారని కోరారు. ఈ సమయం తక్కువ కాదు ఎక్కువ కూడా కాదని అభిప్రాయపడ్డారు. ప్రజలు ముఖ్యంగా యువత గుడ్డిగా అభిమానం అనే మత్తులో మునిగిపోకుండా ఏ పార్టీ జెండా మోయకుండా దేశ,రాష్ట్ర,గ్రామాల అభివృద్ధే ఎజెండాగా గల పార్టీలను గాని,వ్యక్తులను గెలిపించుకోవడమే ధ్యేయంగా ఓటు వేయాలని సూచించారు. ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పాలక పక్ష పనితీరును నిశితంగా పరిశీలిస్తూ ఉండాలన్నారు. ప్రభుత్వం గనుక అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీసేలా ప్రశ్నించే తత్వాన్ని అవగాహనని అందరూ పెంచుకోవాలని కోరారు. ప్రజలు మారితేనే నాయకులు మారుతారని అన్నారు. ప్రజలు కూడా లంచం తీసుకుని ఓటు వేస్తే ప్రశ్నించలేరని అన్నారు. గెలిచిన వారి ఆగడాలకు ప్రజలు బలి కావాల్సిందే తప్ప ఏమి చేయలేరని హెచ్చరించారు. మంత్రాన్ని జపిస్తాయని తత్ ఫలితంగా మన దేశం పురోగమించి ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం కూడా వంద శాతం ఓటు నమోదుకు తగిన చర్యలు తీసుకోవాలని అప్పుడు మాత్రమే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కు ఉద్దేశ్యం అపహాస్యం పాలు కాదని పేర్కొన్నారు.

## వరంగల్ పార్లమెంట్ బీఎస్పీ అభ్యర్థి పంజ కల్పన కు ముస్లింల సంపూర్ణ మద్దతు

**-ముస్లింల సంక్షేమం కేవలం బహుజన్ సమాజ్ పార్టీతోనే సాధ్యం**

**-మైనార్టీ రాష్ట్ర నాయకులు మహ్మద్ అమీర్**



**తొలి అక్షరం/తొర్రూర్ రూరల్,ఏప్రిల్29:**తొర్రూర్ పట్టణ కేంద్రంలో సోమవారం ముస్లిం సోదరులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మైనార్టీ రాష్ట్ర నాయకులు మహమ్మద్ అమీర్ మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ బీఎస్పీ అభ్యర్థి అయిన పంజా కల్పనకే ముస్లింల సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొంటూ గత ప్రభుత్వమైన బీఆర్ఎస్ ముస్లింలకు విద్య ఉద్యోగ విషయాలలో 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి పది సంవత్సరాలు అధికారం చేపట్టి ముస్లింలకు రిజర్వేషన్లను కల్పించే విషయంలో పూర్తిగా మోసం చేసిందని ఆరోపిస్తూ గత మూడు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లింలు బీఆర్ఎస్ పార్టీని ఓడించడంలో తమ వంతు పాత్రను పోషించారని గుర్తు చేస్తూ ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందనుకుంటే ముస్లింల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తూ కొత్తగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కేబినెట్ లో ఒక్క ముస్లిం మంత్రి లేకపోవడం చాలా సిగ్గుచేటని విమర్శిస్తూ త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ముస్లింల సత్తా ఏమిటో బీఆర్ఎస్ మరియు కాంగ్రెస్ పార్టీలకు చూపుతామంటూ ముస్లింల సంక్షేమం కేవలం బహుజన్ సమాజ్ పార్టీతోనే సాధ్యమవుతుందని అంటూ పాలకుర్తి నియోజకవర్గం తొర్రూర్ డివిజన్ ప్రాంతానికి చెందిన పంజకల్పన వరంగల్ పార్లమెంట్ బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేయడం అభినందనీయమని అంటూ కల్పన వృత్తిరీత్యా ఉపాధ్యాయురాలు అయినప్పటికీ ప్రజాసేవ లక్ష్యంగా రాజకీయాల్లోకి ప్రవేశించి చారిటబుల్ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు పాలకుర్తి నియోజకవర్గంతో పాటు ఇతర నియోజకవర్గాలకు చెందిన మహిళలు తన కాళ్లపై తమ నిలబడే విధంగా ఆర్థికంగా బలపడే విధంగా కుట్టు మిషన్ శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసి మహిళలకు శిక్షణతో పాటు ఉచిత భోజన సౌకర్యాన్ని కల్పించి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తన వంతు కృషి చేయడం జరిగిందని తెలుపుతూ వరంగల్ పార్లమెంట్ బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఇలాంటి నిరుపేద కుటుంబానికి చెందిన పంజా కల్పనకే వరంగల్ పార్లమెంటుకు సంబంధించిన సబ్బండ మరియు బహుజన వర్గాల ప్రజలు మద్దతు తెలిపి ఆమెను పార్లమెంటుకు వెళ్లే విధంగా తమ తమ ఓట్ల ద్వారా అత్యధిక మెజార్టీని ఇచ్చి ఆశీర్వాదాలు ఇవ్వాలని పిలుపునిస్తూ వరంగల్ పార్లమెంట్ లో ఉన్న ముస్లిం సమాజం మొత్తం కల్పనకే మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహమ్మద్ పాషా,మహమ్మద్ గఫార్,మహమ్మద్ రియాజ్, మహమ్మద్ అబ్బాస్,అలీ,షేక్,యాకుబ్ పాషాస్, సయ్యద్ ఖాజాపాషా,సలీం పాషా తదితరులు పాల్గొన్నారు.

## పదండి ముందుకు పదండి ముందుకు పైపైకి

**-నేడు శ్రీ శ్రీ శతజయంతి**

**-కవి రచయిత బొమ్మిడి వినోద రెడ్డి**



**తొలి అక్షరం/నెల్లికుదురు,ఎప్రిల్ 29:** పదండి ముందుకు పదండి ముందుకు పైపైకి,వస్తున్నాయి వస్తున్నాయి జగన్నాథ రథ చక్రాలు అంటూ తెలుగు వారి గుండెలో చైతన్యం ఉత్తేజపరిచినటు వంటి విప్లవ కవి శ్రీ శ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు) 114 వ జయంతి సందర్భంగా తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించి శ్రీ శ్రీ విప్లవ ఝరి వచన కవిత్వంలో ప్రశంసా పత్రం తో పాటు అభినందించిన సందర్భంగా నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామానికి చెందిన కవి రచయిత బొమ్మిడి వినోద్ రెడ్డి కలం నుండి జాలువారిన శ్రీ శ్రీ జయంతి సందర్భంగా కవితతొలి అక్షరం పాఠకుల కోసం ప్రత్యేకం. రక్తాక్షర రాశులు ఒకవైపు. జగన్నాథ రథచక్రాలు మరోవైపు. పదండి ముందుకు పదండి పైపైకి అంటూ,కంచు కాగడలు వెలిగించాడు శ్రీశ్రీ నేను సైతం ప్రపంచాగ్నికి సమీధ ఒక్కటి ఆహుతిచ్చాను. అవినీతి బంధు ప్రీతి చీకటి బజారు కాకూడదు ఈ ప్రపంచం మరో ప్రపంచం

స్వతంత్ర దేశంలో చావు కూడా పెళ్లి లాంటిదే అని ధీటుగా రాసి ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోకుమా నిజం మరచి నిదురపోకుమా

స్వాతంత్ర్యం వచ్చెనని సభలే చేసి

సంబర పడగానే సరిపోదు,దారి పొడవునా గుండె నేతురులు తర్పణ చేస్తూ పదండి ముందుకు బాటలు నడిచిన పేటలు కడిచి కోటలన్నిటిని దాటాండి ,

నది నాదాలు కొండలు కోణాలు ఎడారుల మనకు అడ్డంకి పదండి ముందుకు పదండి తోచుకు తన కవిత్వాలు కుల మత వర్గ బేతలు లేకుండా మహా ప్రస్థానం లా సాగుతుంటాయి తెలుగువాడి వీడిని జోడించిన ఆ కందుడు మన శ్రీశ్రీసమ సమాజ నిర్మాణం కోసం పాటుపడి పాటలు రాసిన శ్రీ శ్రీ సూర్యచంద్రులు ఉన్నంతవరకు తన రచనలు వెలుగుతూనే ఉంటాయి,

ఆయన రాసిన అక్షరాలే చీకటిదారులకు వెలుతురు కిరణాలునిత్య సత్యమైన వాక్కులు

బడుగు వర్గాలకు బాసటనిలుస్తాయి.

## మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కు ఘన స్వాగతం పలికిన బిఆర్ఎస్ నేతలు



**తొలి అక్షరం/తిరుమలాయపాలెం,ఏప్రిల్29:**మే 13న తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకులు కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు మండల బిఆర్ఎస్ నాయకులు ఘనసాగుతం పలికారు. వరంగల్ జిల్లా నుండి ఖమ్మం జిల్లా కు వస్తున్న సందర్భంగా తిరుమలాయపాలెం మండలం మాధురిపురం స్టేజి వద్ద మండల అధ్యక్షులు భాష బోయిన వీరన్న ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు హాజరై కేసీఆర్ బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు వీరన్న మాట్లాడుతూ భాషబోయిన వీరన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని కేసీఆర్ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆయన విమర్శించారు మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ఖమ్మం బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నామ నాగేశ్వరావు అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి నాయకులు కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం ఖమ్మంలో జరుగు కేసీఆర్ బస్సు యాత్రకు పెద్ద ఎత్తున మండల నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు భాష బోయిన వీరన్న మేడిదపల్లి మాజీ సర్పంచ్ బండ్ల విజయ సురేష్ చంద్ర తండా మాజీ సర్పంచ్ బోడ మంచ నాయక్ రామడుగు సురేష్ రావు, ఇస్లావత్ తండా మాజీ సర్పంచ్ ఇస్లావత్ వాచ్చ నాయక్, సోషల్ మీడియా అధ్యక్షుడు ఆర్మీ రవి, బానోత్ రవి పోలేపొంగు రామచంద్ర, పాలా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఐస్ఐ డివిజన్/వీఐపి భద్రత, భారత ప్రభుత్వం

**తొలి అక్షరం/శేరిలింగంపల్లి,ఏప్రిల్29:** న్యూఢిల్లీ అన్ నుండినాటి మెమోరాండం నెం.6-23014/209/భారత/2018- ప్రకారం, ఇది నా దృష్టికి తీసుకురాబడింది. తీవ్రవాద/వ్యతిరేక అంశాలు పారా గ్లైడర్లు, రిమోట్ కంట్రోల్డ్ ద్వారా దాడులను నిర్వహించవచ్చుడ్రోన్‌లు, రిమోట్ కంట్రోల్డ్ మైక్రో లైట్ ఎయిర్‌క్రాఫ్ట్ మొదలైనవి, మరియు ఈవెంట్ నిర్వాహకులు ఇతరులు లైవ్ టెలికాస్ట్‌లు మరియు వివిధ ఈవెంట్‌ల ఫోటోగ్రఫీ కోసం వైమానిక వీక్షణలను పొందడానికి రిమోట్ కంట్రోల్డ్ డ్రోన్‌లను ఉపయోగించే ధోరణి పెరుగుతోంది.
రాష్ట్ర పోలీసు చట్టాలు మరియు ఐపిసి లోని వివిధ సెక్షన్ల కింద రాష్ట్ర/యుటీ పోలీసులు (ఎ) రాష్ట్రంలోని రాష్ట్ర సెక్రటేరియట్ కాంప్లెక్స్ నుండి (5) కిమీ వ్యాసార్థం గల సర్కిల్‌లో ఉన్న ప్రాంతంలో ఇటువంటి వైమానిక ప్లాట్‌ఫారమ్‌లను ఎగురవేయడాన్ని నిషేధిస్తారని పైన పేర్కొన్న మెమోరాండం సూచించింది. రాజధానులు మరియు (2) చుట్టూ కి.మీ వ్యూహాత్మక కీలక సంస్థాపనలుబీ మరియు (బి) ఐపీసి యొక్క సంబంధిత సెక్షన్‌ల కింద నేరం అని ప్రజలకు తెలియజేయడానికి తగిన ప్రచారం చేయండి. ఐపీసి యొక్క 121, 121(ఎ), 287, 336, 337, 338 మొదలైనవి. దీనిని సక్రమంగా ప్రచారం చేయాలి.
పారా-గ్లైడర్‌లు, రిమోట్ కంట్రోల్డ్ డ్రోన్‌లు, రిమోట్ కంట్రోల్డ్ మైక్రో-లైట్ ఎయిర్‌క్రాఫ్ట్ మొదలైనవాటిని ఉపయోగించడం ద్వారా తీవ్రవాద/సంఘవ్యతిరేక ఎలిమెంట్స్ దాడులు చేసే అవకాశం, ప్రజల ప్రశాంతతకు అపాయం కలిగించవచ్చు మరియు శాంతికి భంగం


GOVERNMENT OF TELANGANA
POLICE DEPARTMENT

Office of the Commissioner of Police, Cyberabad.

Dated: 29.04.2024

NOTIFICATION

WHEREAS, vide Memorandum No.VI-23014/209/IND/2018-VS, dated 10-05-2019 from Ministry of Home Affairs, ISI Division/VIP Security, Government of India, New Delhi, it has been brought to my notice that the Terrorist/Antisocial elements may organize attacks through Para Gliders, Remote Controlled Drones, Remote Controlled Micro Light Aircraft etc., and that there is an increasing trend by event's organizers & others to use remote controlled drones for getting aerial views for live telecasts and photography of various events.

WHEREAS, above mentioned Memorandum prescribes that State /UT Police under various sections of State Police Acts and IPC will (a) prohibit flying of such aerial platforms over the area bounded by a circle of (5) Km radius from the State Secretariat Complex in state capitals and (2) Km around strategic Vital Installations; AND (b) give due publicity to inform the public at large that doing so shall be an offence under relevant Sections of IPC such as Sec. 121, 121(a), 287, 336, 337, 338 etc., of IPC. This shall be duly publicized.

The possibility of attacks by Terrorist/Antisocial elements by the use of Para-gliders, Remote Controlled Drones, Remote Controlled Micro-Light Aircraft etc., may endanger and breach of peace to public tranquility.

AND WHEREAS, it is necessary that reasonable checks are imposed on activities of such antisocial elements in the limits of Cyberabad Police Commissionerate to prevent the attack through Remote Controlled Drones or through Para-Gliders or through Remotely Controlled Micro-Light Aircraft.

NOW THEREFORE, I, Avinash Mohanty, IPS., Commissioner of Police, Cyberabad vide powers conferred upon me U/s 144 of the Criminal Procedure Code 1973 (Act II of 1974), **do hereby order that no flying activities of Remotely Controlled Drones or Para-Gliders or Remotely Controlled Micro-Light Aircrafts, will be allowed over the area of Dundigal Police Station of Cyberabad Police Commissionerate in view of visit of Hon'ble Prime Minister of India.**

**Any person contravening this order shall be punishable under relevant sections of law.**

This order shall remain in force **on 30.04.2024.**

As the notice cannot be served individually to all concerned, the order is hereby passed ex-parte. It shall be published for the information of public, through press and by affixing copies on the Notice Boards of the Police Stations, Divisional ACsP, Zonal DCsP Offices.

(Avinash Mohanty, IPS.,)
Commissioner of Police,
Cyberabad.

కలిగించవచ్చు.
అయితే, రిమోట్ కంట్రోల్డ్ డ్రోన్‌ల ద్వారా లేదా పారా-గ్లైడర్‌ల ద్వారా లేదా రిమోట్‌గా నియంత్రించబడే మైక్రో-లైట్ ఎయిర్‌క్రాఫ్ట్ ద్వారా దాడిని నివారించడానికి సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి సంఘవిద్రోహ ఎలిమెంట్‌ల కార్యకలాపాలపై సహేతుకమైన తనిఖీలు విధి
తనిఖీలు దించడం అవసరం.
ఇప్పుడు అందువల్ల, నేను, అవినాష్ మొహంతి, ఐపీఎస్ కమిషనర్, సైబరాబాద్ వైడ్ అధికారులు నాకు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973(యాక్ట్ 2 ప్రకారం, 1974)
యొక్క యు/ఎస్ 144 ప్రకారం, రిమోట్ కంట్రోల్ డ్రోన్ ఎగిరే కార్యకలాపాలు జరగకుండా ఆదేశిస్తున్నాను
లేదా పారా గ్లైడర్ లేదా రిమోట్
కంట్రోల్ మైక్రో లైట్ భారత ప్రధాని పర్యటన దృష్ట్యా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ లోని దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విమానాలను అనుమతిస్తారు,
ఈ ఉత్తర్వులను ఉల్లంఘించే ఏ వ్యక్తి అయినా సంబంధిత చట్టాల్లోని సెక్షన్ల ప్రకారం శిక్ష అర్హుడు అవుతాడు
ఈ ఆర్డర్ 30/04/2024 న అమలులో ఉంటుంది,
నోటీసులు సంబంధిత అందరికీ
వ్యక్తిగతంగా అందజేయడం సాధ్యం కాదు కాబట్టి ఆర్డర్ ఇందుమూలంగా ఎక్స్ పార్టీగా ఆమోదించబడింది, ఇది ప్రజల సమాచారం కోసం ప్రెస్ ద్వారా మరియు పోలీస్ స్టేషన్లు, డివిజనల్ ఏసీ ఎస్పీ, జోనల్ డిసి ఎస్పీ, కార్యాలయాల నోటీసు బోర్డులపై కాపీలను అనుమతించడం ద్వారా ప్రచురించబడుతుంది,
అవినాష్ మొహంతి, ఐపీఎస్, పోలీస్ కమిషనర్, సైబరాబాద్.

## ఓటు అనే రెండక్షరాల పదం దేశ చరిత్రనే మార్చేస్తుంది

**-సిఆర్పిఎఫ్ డీఎస్పీ వృషాలిని,సీఐ కారుణాకర్**




**తొలి అక్షరం/పినపాక,ఏప్రిల్ 29:** ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని ఓటు అనే రెండక్షరాల పదం దేశ చరిత్రనే మార్చేస్తుందని పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకోవాలని సిఆర్పిఎఫ్ డీఎస్పీ వృషాలిని అన్నారు. సోమవారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్డు నుండి పంచాయతీ కార్యాలయం వరకు పంచాయతీ కార్యాలయం నుండి ఎస్సీ కాలనీ మీదుగా టీఎస్ఎస్పీ, సిఆర్పిఎఫ్, స్థానిక పోలీస్ బలగాలతో సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. అసాంఘిక శక్తులకు తావు ఇవ్వకుండా ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకొని నచ్చిన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలియజేశారు. ఓటు హక్కు పై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కవాతు కార్యక్రమంలో ఎస్సై వెంకటప్పయ్య, కరకగూడెం ఎస్సై రాజేందర్, మణుగూరు సబ్ డివిజన్ పోలీసులు, హెడ్ కానిస్టేబుల్ దిలీప్, కానిస్టేబుల్ శ్రీను, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### కేసీఆర్ మాటలు నమ్మే పరిస్థితిలో లేరు

**-కోమటిపల్లి కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు రావుల మల్లేశం**



**తొలి అక్షరం/ఇనుగుర్తి,ఏప్రిల్29:** గప్పుడెప్పుడో కారు పదహారూ అంటివి కేంద్రం మెడలు వంచుతాం కేంద్రంలో అగ్గి రాజేస్తాం మనమే కేంద్రంలో కింగ్ మేకర్ లము.ఏంది ఎప్పుడు ఈ ఊదరగొట్టే మాటలేనా మీ శఖం ముగిసిన అద్యాయనమే అని రావుల మల్లేశం అన్నారు.సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కోమటిపల్లి కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు రావుల మల్లేశం మాట్లాడుతూ కేసీఆర్ వారి కార్యకర్తలను కాపాడు కోవాడానికి బయటకు వచ్చారూ అంతేకాని ప్రజలపైన ప్రేమతో కాదూ అని అయన అన్నారు.అదికారం పోయింది కాబట్టే కేసీఆర్ కు ప్రజలు గుర్తుకు వచ్చారని,అందుకే ఏసీ బస్సులో ఒల్లు అలవకుండ ప్రయాణం చేస్తూ, ప్రజల దగ్గరికి వస్తున్నారని ఆయన తెలిపారు.కేసీఆర్ నీ ఆవేశ పూరిత మాటలతో వేల మంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు.ఉద్యమకారుల ఉసురు తగిలి పోతావు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అప్పుడే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం సాధ్యమని,మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాం నాయక్ ను గెలిపించుకొని సోనియా గాంధీకి బహుమతిగా ఇవ్వాలని రావులమల్లేశం అన్నారు.

## ప్రజలారా ఆలోచించండి మళ్లీ మోసపోకండి

**-అభివృద్ధికి సరైన నిర్వచనం బిఆర్ఎస్ (పార్టీయే)**

**-పెద్ది సుదర్శన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే**

**తొలి అక్షరం/చెన్నారవుపేట(నర్సంపేట,ఏప్రిల్29:** నర్సంపేట నియోజకవర్గం ఖానాపూర్ మండలం మనుబోతుల గడ్డ, ధర్మరావుపేట గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.పాకాల చెరువుకు గోదావరి నీళ్లు మళ్లించి ప్రాజెక్టులను నిర్మాణం చేసి రెండు పంటలు పండించుకునే అవకాశాన్ని కేసీఆర్ ప్రభుత్వంలో నేను కల్పించాను ఆరోజు కాంగ్రెస్ వాళ్లు ప్రాజెక్టు లేదన్నారు. అదే ప్రాజెక్టు ద్వారా నీళ్లు ఇస్తూ,మేము ఏదో చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారు. నేను కట్టిన పాకాల ప్రాజెక్టును సందర్శించే సాహసం ధైర్యం, స్థానిక ఎమ్మెల్యేకు లేదా?. పాకాల కింద రైతులు పండించిన ధాన్యాన్ని 500 బోనస్ చెల్లించి కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిని కూడా



కలవలేని వారు నర్సంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారా?ఇక్కడున్న సమస్యలను రాష్ట్రంలోని అధికారులకు మంత్రులకు చెప్పలేని స్థాయిలో ఇక్కడి నాయకత్వం ఉంది.మళ్ళీ ప్రజలు మీకు ఎందుకు ఓటు వేయాలి?-ఈనియోజకవర్గంలో 6 గ్యారంటీల అమలు మరియు అభివృద్ధికి ఎవరు బాధ్యత వహిస్తారు?. కింది స్థాయి నాయకులు ఓట్లు అడిగేవారేతప్ప అభివృద్ధి గురించి మాట్లాడేవారు, చేసేవారు కాదు. హనీ ఎద్దేవా హెద్దేవా చేశారు కాంగ్రెస్ పార్టీ గెలిచిన తర్వాతనర్సంపేటలో పైరవీకారులుఎక్కువయ్యారు.మున్సిపాలిటీ%ఛ%మండలాలలో చోట-మోటనాయకుల అరచకాలుపెరిగిపోతున్నాయి అన్నారుఅలాగేధర్మారావుపేట గ్రామం మొదటి నుంచి ఉద్యమాలలో టిఆర్ఎస్ పార్టీ కేసీఆర్ తో నడిచింది.ఈ గ్రామంలో ప్రశ్నించే తత్వం కలిగిన వారు ఎక్కువ. భవిష్యత్తులో అధికారపక్షాన్ని ఈగ్రామంనిలదీస్తుందనిభావిస్తున్నాను అన్నారు.కాబట్టి నియోజకవర్గ ప్రజలారాఆలోచించండి.మళ్లీ మోసపోకండి.నిజమైన అభివృద్ధి జరగాలంటే బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన మాలోత్ కవిత కి మీ ఓటు వేయాలనికోరుతున్నాను.ప్రచారం అనంతరం ఓటరు మహాశయులను ఓటు అర్థించడం జరిగింది.ఈ ప్రచార కార్యక్రమంలో ఓ డి సి ఎం ఎస్ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపిపి, జెడ్పిటిసి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, ఎంపిటిసిలు, తాజా మాజీ సర్పంచ్ లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ఆర్ఎస్ఎస్ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

### రామసహాయం రఘురాం రెడ్డి గెలుపు నల్లేరు మీద నడకే

**-పొంగులేటి ప్రసాద్ రెడ్డి**



**తొలి అక్షరం/తిరుమలాయపాలెం,ఏప్రిల్29:** సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ పార్లమెంట్ అభ్యర్థి ఐదుసార్లు అసెంబ్లీకి ఎన్నికైన రామసహాయం సురేందర్ రెడ్డి తనయుడు రఘురాం రెడ్డి గెలుపు నల్లేరు మీద నడకే అని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పొంగిలేటి ప్రసాద్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కాకరవాయి పైనంపల్లి బీరోలు పిండిప్రోలు గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రామసహాయం రఘురాం రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా పొంగులేటి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ ఐదు నెలల కాలంలో ఆరు గారంటీలో నాలుగు గారెంటీలు ఇప్పటికే అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ కి దక్కుతుందని మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో రామసహాయం రఘురాం రెడ్డి గెలుపు నల్లేరు మీద నడకే అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 17 పార్లమెంటు స్థానాల్లో అత్యధిక మెజార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రఘురాం రెడ్డి ది అవుతుందని తెలిపారు. ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి మళ్లీ ప్రజల ముందుకు కల్లబొల్లి మాటలు చెబుతూ వస్తున్న బిఆర్ఎస్ నాయకులను నమ్మొద్దని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు బెల్లం శ్రీనివాస్ జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి అరవింద రెడ్డి, గంద్ర గోపాలరావు, ఎస్ కే మల్సూర్, చెన్న కృష్ణారెడ్డి, గుండా రఘురాం రెడ్డి, మట్టపల్లి చంద్రారెడ్డి వెన్నం సుధాకర్ రెడ్డి ఆత్మకూరి కోటయ్య కొత్తపల్లి వెంకటరెడ్డి కొప్పుల రాంరెడ్డి గోపోజి రవికుమార్ షేక్ జాన్ బాబు నేతగాని వెంకన్న కమటం లక్ష్మణ్, దామల్ల ఉపేందర్ కట్టుకూరు శ్రీనివాస్ రెడ్డి, గూడూరు ఉపేందర్, మోరపాక నాగయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు విక్రమ్ రెడ్డి, ఎంపీపీ బోడా మంగీలాల్ నాయక్, దొడ్డ గురవయ్య, తాతా బిక్షమయ్య, దూదిమెట్ల వెంకట్, రావూరి యాకోబు రావు, జాల కిరణ్, చామకూరి నర్సయ్య టెంకటి నాగేశ్వరరావు చామకూరి కృష్ణమూర్తి చామకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బలరాం నాయక్ ని గెలిపించుకోవాలి-తుమ్మల నాగేశ్వర్ రావు

**తొలి అక్షరం/చెన్నారవుపేట(నర్సంపేట)/ఏప్రిల్29:** నర్సంపేట నియోజకవర్గం దుగ్గొండి మండలం గిర్నిబావి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపే లక్ష్యంగా ఎన్నికల సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరయ్యారు.ఈ సందర్బంగా వ్యవసాయశాఖరాష్ట్రమంత్రితుమ్మల నాగేశ్వరరావుమాట్లాడుతూ..మొన్న జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎలాగైతే దొంతి మాధవ రెడ్డి ని గెలిపించు కున్నామో అలాగే మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపు కోసం గడప గడపకు తిరిగి కాంగ్రెస్ పార్టీ చేసిన




5 గ్యారంటీ ల గురించి కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వస్తే కాంగ్రెస్ పార్టీ అమలు చేసే 5 గ్యారంటీ ల గురించి వివరించి హస్తం గుర్తుకు ఓటు వేసే విదంగా దిశ నిర్దేశం చేశారు అదే విధంగా 200 యూనిట్ల వరకు వచ్చే కరెంట్ బిల్లు ఎవరు కూడా కట్టొద్దు అని అదేవిధంగా గ్యాస్ సీలిండర్ కి ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ 500 రూపాయలు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కొందరి అకౌంట్ లో రాలేదు అలాగే ఎన్నికల కోడ్ ముగియగానే అందరికి సబ్సిడీ వస్తుందని ప్రజలకు తెలియజేశారు అదే విధంగా నిరుపేద కుటుంబాల సొంత ఇంటి కల నెరవేర్చడానికి ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తారు అని తెలియజేయాలని దొంతి మాధవ రెడ్డి వివరించారు బలరాం నాయక్ నిఅత్యధికమెజారిటీతోగెలిపించాలనినాయకులకు,కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మినరల్ వాటర్ మాటున దందా వాటర్ పేరుతో మాయా జలం

**తొలి అక్షరం/ఇనుగుర్తి,ఏప్రిల్29:** మంచి నీటి పేరిటి మహా మోసమే జరుగుతోంది. కొన్ని వాటర్ ప్లాంట్లలో చూస్తే కనీస నియమ నిబంధనలు పాటించడం లేదు. అడ్డగోలుగా నీటిని శుద్ధి చేసామని చెప్పి ఇష్టారీతిగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.అయినప్పటికీ అధికారులు మాత్రం మాకేంటి అని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తు న్నాయి. ఇనుగుర్తి మండలంలోప్యూరిఫైడ్ నీటి పేరుతో సాధారణ నీటిని సరఫరా చేస్తూ ప్రజలను మోసం చేస్తూ వారి ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. మండలంలో నడుస్తున్నాయి.అయితే వీటిలో వాటర్ ప్లాంట్లకు ఎటువంటి అనుమతులూ లేకుండా వేల రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. మినరల్ వాటర్ మాటున దందామినరల్ వాటర్ పేరుతో ప్లాంట్ల యాజమాన్యాలు నీటిని శుద్ధి చేయకుండానే 20 లీటర్ల క్యాన్లలో నింపి నీళ్లను అధిక ధరలకు విక్రయిస్తూ దందా చేస్తున్నారు. నీటి నిల్వ చేసే వాటర్ ట్యాంకలను నెలల తరబడి శుభ్రం చేయకుండా వాడటంతో నాచు పేరుకు పోయి బాక్టీరియా చేరుతోంది. అదే వాటర్ని ప్యూరిఫైడ్ వాటర్ పేరుతో , వాటర్ క్యాన్లు లో నింపి మార్కెట్లోకి విడిచి పెడుతున్నారు. ఈ వాటర్తోనే ప్రజలు ఎండ తీవ్రత దృష్ట్యా తాగి దాహార్తిని తీర్చుకుంటున్నారు.కాగా నీటిని శుద్ధి చేసిన తరువాత ఆ నీటిలో ఎంత మేర మినరల్స్ ఉంటున్నాయి,



ప్రజలకు ఎంత మేర ఆ నీరు ఆరోగ్యాన్ని రక్షిస్తుంది అనే అంశాలపై తప్పనిసరిగా ఒక టెక్నిషియన్ ప్రతీ ప్లాంటు యాజమాన్యం ఏర్పాటు చేసుకోవాలి. రోజూ నీటిని పరీక్ష చేసిన తరువాత అందులో పుష్కలంగా మినరల్స్ ఉంటేనే ఆ నీటిని వాటర్ క్యాన్లు, నింపి మార్కెట్లోనికి విడుదల చేయాలి. అవేమీ లేకుండా ఇష్టారాజ్యంగా వాటర్ ప్లాంటు యాజమాన్యాలు ప్రజలు ఏమైతే మాకేంటి అన్న చందంగా వ్యవహరిస్తూ కలుషిత వాటర్ని ప్రజలకు అందిస్తున్నారు. కొన్ని చోట్ల కొళాయిల ద్వారా సరఫరా అయిన వాటర్ని కూడా క్యాన్లు, పట్టి అమ్మేస్తున్నారు.
ఇదంతా చూసినా అధికారు లు మాత్రం పట్టించుకున్న దాఖలాలు కానరావడం లేదు. చోద్యం చూస్తున్న అధికారులువాటర్ ప్లాంట్లు నడిపే యాజమాన్యాలు తప్పనిసరిగా ఐయస్ఐ పొందాలి. అందుకోసం కొంత మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ప్లాంటు ఏర్పాటు చేసే చోట నీటి లభ్యత, నాణ్యత, అందులో వచ్చే మినరల్స్ ఏమేర ఉన్నాయి, ప్రజలకు అది ఆరోగ్యకరమైన నీరేనా అనే అంశాలపై సంబంధిత డిపార్టెంటు
ఖచ్చితత్వంతో కూడిన సర్టిఫికేట్ ఇవ్వాల్సి ఉంటుంది. అంతే కాకుండా సంబంధిత ప్లాంటు ప్రతీ ఏడాది రెన్యువల్ చేసుకోవాలి.ఎప్పటికప్పుడు నీటిని తప్పనిసరిగా పరీక్ష చేయించాలి. అవేమీ లేకుండా అధికారుల అండదండలతో ఇష్టారాజ్యంగా వాటర్ ప్లాంటు యాజమాన్యాలు తమకు నచ్చిన రీతిలో నియమ నిబంధనలు పాటించకుండా వాటర్ ప్లాంట్ల పేరుతో నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెల్లినా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ పలువురు అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ప్రజలకు సరఫరా చేసే ప్యూరిఫైడ్ వాటర్ పట్ల అధికారులు సంబంధిత ప్లాంట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### గౌరారం లో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం



**తొలి అక్షరం/బయ్యారం,ఏప్రిల్29:** బయ్యారం మండలం గౌరారం ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన పార్లమెంట్ అభ్యర్థి శ్రీమతి మాలోతు, కవిత గెలుపు కొరకు మే 1వ తారీఖున బిఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మహబూబాబాద్ రోడ్ షో కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు ముఖ్య నాయకులతో సమావేశమై మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కుమారి అంగోతు,బిందు ఈ కార్యక్రమంలో బయ్యారం పిఎసిఎస్ వైస్ చైర్మన్ గంగుల సత్యనారాయణ. ఎంపీటీసీ వజ్జభద్రయ్య. ఏనుగుల ఐలయ్య, మాజీ సర్పంచ్ తాటి వెంకన్న. మాజీ ఉపసర్పంచులు యా దనాల మహేశ్వరి. గ్రామ శాఖ అధ్యక్షులు. కార్యదర్శులు. తేజావత్ మాల్సూర్ వజ్జ లక్ష్మయ్య. వర్రె యాకుపాషా. దేవి వెంకన్న. దేవన బోయిన శ్రీను. శ్రీరామ్ శెట్టి సాంబయ్య. నిమ్మల రామారావు. బట్టు మధుకర్ లక్ష్మణ్. వీరన్న. హత్తి రామ్. బొర్ర శ్రీను. లచ్చు. నరేందర్. మునేందర్. ప్రసాద్. నరసింహా. స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## ప్రపంచ కార్మికుల ఏకంకాండి

**-మే డే ను విజయ వంతం చేయండి**

**-సిపిఎం మండల సీనియర్ నాయకులు**

**ఇసంపల్లి సైదులు**

**తొలి అక్షరం/నెల్లికుదురు,ఏప్రిల్29:** ప్రపంచ కార్మికులు ఏకమై ప్రపంచ కార్మిక దినోత్సవమైన మేడే వేడుకలను విజయవంతం చేయాలని సిపిఎం మండల సీనియర్ నాయకులు ఇసంపల్లి సైదులు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ మే డే అంతర్జాతీయ కార్మిక వర్గాల ఐక్యతకు



సంకేతమని కార్మిక వర్గ చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. శ్రమ దోపిడికి వ్యతిరేకంగా వేలాది గొంతుకలు ఒక్కటైన చరిత్రకు సాక్ష్యమే ఎనిమిది గంటల పని దినమన్నారు. 138 ఏళ్ల క్రిందట కార్మికులు సాగించిన వీరోచిత పోరాటాల ఫలితంగానే ప్రపంచ కార్మిక వర్గానికి హక్కులు దక్కాయన్నారు. మేడే శ్రమజీవుల విజయనాదమన్నారు. కానీ కార్మికులు పోరాటం చేసి సాధించుకున్న చట్టాలను సంస్కరణల పేరుతో పాలకవర్గాలు కాలగర్భంలో కలపాలని చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్, పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండేలా 44 కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా విభజించి కార్మికుల శ్రమను దోచుకునేందుకు ఎనిమిది గంటల పని దినాలను ప్రభుత్వాలు 12 గంటలకు మార్పు చేశాయన్నారు. ప్రభుత్వాలకు ఆదాయం సమకూర్చే పబ్లిక్ రంగ సంస్థలలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారికి సామాజిక భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాలను ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ మేడే వేడుకలలో హమాలీ, కూలి, అంగన్వాడి, ఆశ, మధ్యాహ్న భోజనం, రిక్షా, ఆటో కార్మికులతో పాటు అన్ని వర్గాలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

### నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో,ఏప్రిల్29:** మండలంలోని లక్ష్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ భద్రయ్య సోని వివాహ రిసెప్షన్ కు సోమవారం భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం గ్రామానికి చెందిన మేడిపెల్లి సతీష్ అనే యువరైతు పొలంలో పనులు చేస్తుండగా పాముకాటు కు గురై చికిత్స తీసుకున్న విషయం తెలుసుకుని వారి నివాసానికి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ పోరెడ్డి పూర్ణచందర్ రెడ్డి, మీసం భరత్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పర్శిక రాజ

**తొలి అక్షరం/బయ్యారం,ఏప్రిల్29:**
మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని కాచినపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఉన్న మోట్లగూడెంలో తాటి చుక్కయ్య (లేటు)- ఆదిలక్ష్మి దంపతుల కుమారుడు విష్ణుమూర్తి-రోజాకి వివాహ రిసెప్షన్ కు వేడుకల్లో హాజరై నూతన వధూవరులకు అక్షంతలు వేసి వారిని ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పర్శిక రాజు ఈ కార్యక్రమంలోని పాల్గొన్న యూత్ యువకులు, సురబాక నరేష్, తాటి లక్ష్మీనారాయణ, పులసం సంతోష్, తాటి, సర్వీస్ బాబు సురబాక సంతోష్, తాటి గణేష్, చింత సాయి సురబాక,రాజకుమార్ బొమ్మల వర్మ ఏప, రవీందర్ పులసం, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు



## బాబోయ్ బగబగా

### -ఉదయం పది దాటితే నిర్మానుష్యంగా మారుతున్న ప్రధాన రహదారులు

### -వడదెబ్బ భారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు



**తొలి అక్షరం/గణపురం,ఏప్రిల్29:** భానుడి భగభగతో ప్రజలు బేజారవుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు అయితే రోజురోజుకు పెరుగుతున్నాయి. వ్యవసాయ, నాపరాతి గనుల్లో పనులకువెళ్లే దినసరి కూలీలు ఉదయం 10గంటలకే ఇంటిబాట పడుతున్నారు. భానుడి భగభగతో మండలం నిప్పులకొలిమిగా మారింది. మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండవేడిమి తగ్గుముఖం పట్టడంలేదు. రాత్రి 7 గంటల వరకూ జనం ఉక్కపోతతో అల్లాడుతున్నారు. ఏప్రిల్ నెలలో పరిస్థితి ఇలాఉంటే మే నెలలో ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది సుమారు 40 నుంచి 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఈసారి కూడా 41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం తొమ్మిది దాటితే చాలు ఎండవేడిమి తట్టుకోలేక పోతున్నారు. ప్రస్తుతం ఏప్రిల్ నెలలో 40 డిగ్రీల నుంచి 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మే నెలలో ఎండల తీవ్రత ఏ విధంగా ఉంటుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అత్యవసరం ఉంటే తప్ప బయటికి రావడానికి భయపడుతున్నారు. ఎండ తీవ్రతతో మండలంలో ఎప్పుడూ రద్దీగా ఉండే బస్టాండ్, గాంధీ నగర్, చెల్పూర్ చౌరస్తాలు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వీధి వ్యాపారులు ఎండ తీవ్రత నుంచి రక్షించుకోవడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని ఉపశమనం పొందుతున్నారు. మధ్యాహ్నం బయటికి వచ్చేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వేసవిలో ఎక్కువగా చిన్నారులు డీహైడ్రేషన్‌కు గురై సోడియం, పోటాషియం లాంటి లవణాలను కోల్పోతుంటారు. ఈ లవణాలు తగ్గకుండా ఉండటానికి పండ్ల రసాలు, మజ్జిగ లాంటివి తాగించాలని వైద్యులు సూచిస్తున్నారు.

**ముందు జాగ్రత్తతో వడదెబ్బకు దూరం:**

వేసవి కాలంలో వడ దెబ్బ బారిన పడుతుంటారు. చిన్న పిల్లల నుంచి పెద్దల దాకా వడదెబ్బ బారిన పడి ప్రాణాలు కోల్పోతుంటారు. వడ దెబ్బ తగిలినప్పుడు శరీర ఉష్ణోగ్రత పెరిగి తీవ్రమైన తలనొప్పి రావడం, నాడి వేగంగా కొట్టుకోవడం, చర్మం ఎండిపోవడం, నీరసంగా ఉండడం, మూత్రం పసుపు రంగులో రావడం పాక్షికంగా లేదా పూర్తిగా అపస్మారకస్థితిలోకి వెళ్లడం లాంటివి ఉంటాయి. పై లక్షణాలు ఉన్నప్పుడు వడదెబ్బగా గుర్తించాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తిని చల్లని గాలి ప్రదేశానికి తీసుకువెళ్లి అతడు వేసుకున్న దుస్తులు విడిచేసి చల్లని గాలి తగిలేలా చూడాలి. అక్కడే ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం స్థానిక ప్రాథమిక ఆసుపత్రికి తరలించాలని అంటున్నారు.

## కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు







**తొలి అక్షరం/పర్వతగిరి,ఏప్రిల్29:**వర్ధన్నపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ బలం రోజురోజుకు పుంచుకుంటుంది.సబ్బండ వర్గాల ప్రజల కాంగ్రెస్ పార్టీకే మద్దతు తెలుపుతున్నారు. కడియం కావ్య గెలుపే లక్ష్యంగా పనిచేయాలి.బీజేపీ, బిఆర్ఎస్ పార్టీల నుండి కాంగ్రెస్ లో చేరిన సుమారు 50మంది నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన వర్ధన్నపేట శాసనసభ్యులు విశ్రాంత ఐపిఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు.సోమవారం పర్వతగిరిమండల పరిధిలోని సోమారం గ్రామ బిఆర్ఎస్,బీజేపీ పార్టీల నాయకులు సుమారు 50 మందిని పర్వతగిరి మండల పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన గౌరవ వర్ధన్నపేట శాసనసభ్యులు విశ్రాంత ఐపిఎస్ అధికారి కేఆర్ నాగరాజు అనంతరం ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పాత కొత్త అనే విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరు కష్టపడి మన అభ్యర్థి కడియం కావ్య భారీ మెజారిటీతో గెలిపించాలని అలాగే మన కాంగ్రెస్ పార్టీ రైతాంగం సంక్షేమానికి పని చేస్తుందని అన్నారు. పార్టీలో చేరిన కార్యకర్తలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే గారు హామీ ఇచ్చారు.బిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీ లో చేరిన వారు మాజీ ఎంపీటీసీ వడ్లకొండ ఎల్లా గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు వడ్లకొండ శ్రీనివాస్, ఆత్మ డైరెక్టర్ చౌద సుధాకర్, బత్తుల కృష్ణ, బూత్ కన్వీనర్ బక్కి వెంకటేశ్వర్లు, బిక్కి యాక నారాయణ, బిక్కి ప్రసాద రావు, పున్నం యాకయ్య, తాటికాయల దర్గయ్య, గుగులోతు కిషన్, రవి, మైనారిటీ అధ్యక్షుడు ఎం.డి హమ్మద్ తో తదితరులు పార్టీ లో చేరారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్, సీనియర్ నాయకులు పల్లెపాటి రతన్ రావు, చౌద రాఘవలు, ఎంపీపీటీసి లావుడియా సరోజన - లచ్చు నాయక్, వంగాల రవీందర్, మండల, గ్రామ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు....

## ఎంపీ ఎలక్షన్లో కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**తొలి అక్షరం /తొర్రూర్ రూరల్,ఏప్రిల్29:**తొర్రూర్ పార్టీ కార్యాలయంలో పట్టణ వార్డు కౌన్సిలర్లు వార్డు అధ్యక్షులతో పార్లమెంట్ ఎన్నికల నేపత్యంలో ముఖ్యనాయకులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించి దిశనిర్దేశం చేసిన స్థానిక శాసన సభ్యురాలు యశస్విని ఝాన్సి రెడ్డి బిఆర్ఎస్ రహిత నియోజకవర్గం గా పాలకుర్తిని తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళు_్నామని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి స్పష్టం చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ 2023 జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ప్రజలు పాలకుర్తి నియోజకవర్గం లో నియంత పాలనకు చరమగీతం పాడారని గుర్తు చేశారు అదేవిదంగా మన అభ్యర్థి డా కడియం కావ్య ని కూడా భారీ మెజారితో గెలిపించి పాలకుర్తి సత్తా చాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్ మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య వార్డు కౌన్సిలర్లు వార్డు ఇన్చార్జ్ లు తొర్రురు మండల అధ్యక్షులు పార్టీ ముఖ్యనాయకులు యూత్ నాయకులు పట్టణ యూత్ నాయకులు ముఖ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు

# జనసంద్రమైన తొర్రూర్-ఉప్పొంగిన ప్రజాభిమానం



**తొలి అక్షరం/ తోర్రూర్ రూరల్,ఏప్రిల్29:** బస్సు యాత్రలో భాగంగా మార్గమధ్యలో మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణంలో ఆగిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజలకు అభివాదం చేసి మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సుధీర్ కుమార్ కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించగలరని ప్రజలకు విజ్ఞప్తి చేయడం జరిగింది అదేవిధంగా మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం గడిచిన నాలుగు నెలలు కాలంలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని ఎంపీ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సుధీర్ కుమార్ కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ ఎన్నికల ఇన్చార్జి మధుసూదనాచారి మెట్టు శ్రీనివాస్ టిఆర్ఎస్ సీనియర్ నాయకులు పొనుగోటి సోమేశ్వరరావు మండల పార్టీ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు తోరూర్ జెడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్ గాంధీ నాయక్ ప్రమోద్ హనుమాన్ల ప్రదీప్ రెడ్డి కుర్ర శ్రీనివాస్ కర్నే నాగరాజు ఎన్నమనేనీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ లో ముసలం

- -ఒంటెద్దు పోకడమే కారణమని ఆరోపణలు
- -పాత క్యాడర్ లో రెండు వర్గాలుగా కాంగ్రెస్
- -కొత్తగా పార్టీలో చేరిన నాయకులకు సమాచారం ఇవ్వడం లేదని ఆరోపణ
- -ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు



**తొలి అక్షరం/నర్సింహులపేట,ఏప్రిల్ 29:**కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గత తొమ్మిది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో వివిధ స్థాయి నాయకులు, కార్యకర్తలకు స్థానం కల్పించడం లేదని నిరాశకు లోనవుతున్నారు. ఇటీవల గెలిచిన డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్, నర్సింహులపేట మండలంలో నలుగురు లీడర్లు ఏ పనైనా వీళ్ళని కలిసి చేయించుకోవాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఇదే అదునుగా భావించిన కొందరు నాయకులు దందాలు చేస్తూ, కేవలం వారికి అనుకూలంగా ఉన్న నాయకులని ప్రాధాన్యత కల్పిస్తూ, గత రెండు నెలల నుంచి ఇదే విషయం లో పాత కాంగ్రెస్ లో రెండు గ్రూపులుగా ఏర్పడి, ఇటీవల ఎమ్మెల్యే ఎలక్షన్ల కంటే ముందు పార్టీలో చేరిన, ప్రస్తుతం జరుగుతున్న ఎంపీ ఎలక్షన్లకు ముందు చేరిన వారికి ఎక్కడ ప్రాథమిక కల్పించడం లేదని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఓ లీడర్ నా దగ్గరికి వచ్చిన వారికే పని చేస్తా అనీ చెప్పడం, ముందు ముందు మండల పార్టీ మార్పు ఖాయమని కార్యకర్తలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలలో కొందరికి ప్రాథమిక ఇస్తు, మరికొందరిని ఇవ్వకపోవడంపై ఎమ్మెల్యే కు పలువురు ఫిర్యాదు చేసినట్లు కార్యకర్తలే బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ముందు నుంచి పార్టీని నమ్ముకొని ఉన్నాడని సిద్ధాంతంతో, అన్ని శాఖలను ముందుండి చూసుకోవాలని ఎమ్మెల్యే అప్పచెప్తే.. తన అన్యాయులకే పనులు చేస్తున్నారాని మరి కొంతమంది కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. దీనిపై ఎమ్మెల్యే గట్టిగా మందలిచ్చినట్లుగా తెలుస్తుంది. ఎంపీ ఎలక్షన్ల తర్వాత మండల పార్టీ మార్పు ను కోరుకుంటున్నట్లు పలువురు కార్యకర్తలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## పార్లమెంట్ సభ్యులు అరూరి కి మద్దతు తెలిపిన ఉప్పరగూడెం వడ్డెకొతపెల్లి ప్రజలు మహిళలు



**తొలి అక్షరం/పెద్దవంగర,ఏప్రిల్29:**పెద్దవంగర మండలం లోని ఎన్నికల ప్రచారంలో భాగంగా నాంచారి మాడూర్ గ్రామం నుండి పెద్ద వంగర వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలోని ఉప్పర గూడెం గ్రామ వద్ద వరంగల్ బిజెపి పార్టీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ వెళ్తున్న వాహనాన్ని మహిళలు కమలం పువ్వు గుర్తుకే మన ఓటు అని అనగా అది గమనించిన రమేష్ గారు తన వాహనాన్ని ఆపి అక్కడ ఉన్న మహిళలతో మాట మంతి కలిపారు. అదేవిదముగా వడ్డేకొతపెల్లి గ్రామం లో ఎన్నికల ప్రచారం లో భాగముగా గ్రామ ఎంపీటీసీ సాయిని ఝాన్సీ రవి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిధులు మనకు మోదీ బీజేపీ ప్రభుత్వం ద్వారా వస్తున్న పండ్స్ సీసీ రోడ్స్ కానీ మురికి కాల్వలు రేషన్ బియ్యం మరుగుదొడ్లు కానీ గ్రామ పంచాయతీ కి వచ్చే నిధులు మొత్తం సెంట్రల్ నుడి వస్తున్నాయి అని గ్రామ ప్రజలకు తెలియచేస్తూ మళ్ళీ వచ్చేది మోదీ ప్రభుత్వం కాబట్టి మనమందరం బీజేపీ ఓటు వేసి ఆరూరి రమేష్ అన్నను గెలిపించుకోవాలని అన్నారు ఈ కార్యక్రమం లో పాలకుర్తి నియోజకవర్గం శాశనసభకు పోటీచేసిన లేగ రామ్మోహన్ రెడ్డి పెద్దవంగర మండల బీజేపీ అధ్యక్షులు సుధాకర్ జిల్లా ఉపాధ్యక్షులు రంగు మురళి పార్టీ నాయకులు చట్టు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

# తొర్రూర్ కు అదనపు కోర్టులు కేటాయించాలి

## ఆర్కే బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో(సాంబ),ఏప్రిల్ 29:** తెలంగాణా హైకోర్టులో రాష్ట్రవ్యాప్త బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శుల కన్వెన్షన్ లో మహబూబాబాద్, తొర్రూర్ అసోసియేషన్ ల తరపున ప్రముఖ న్యాయవాది,బార్ జనరల్ సెక్రటరీ ఆర్కే ఘనపురం పాల్గొని, తొర్రూరులో అదనపు కోర్టుల కేటాయింపు,స్టాఫ్ కొరత వంటి సమస్యలను ఫెడరేషన్ ఎదుట ప్రస్తావించారు..

అందుకు కన్వెన్షన్ ఆర్గనైసర్స్ కూడా సానుకూలంగా స్పందించి సదరు సమస్యల పరిష్కారం దిశగా ఉమ్మడి కార్యాచరణను రూపొందిస్తామని, తీర్మానాన్ని హైకోర్టు చీఫ్ జస్టీస్ మరియు రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు ...

ఈ కార్యక్రమములో లిరాష్ట్రం లోని 108 బార్ అసోసియేషన్ ల అధ్యక్ష, కార్యదర్శులుపాల్గొని తమ,తమ ప్రాంత సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం దిశగా భవిష్యత్తులో ఐక్య కార్యాచరణను రూపొందించాలని తీర్మానించారు...

# నిలిచిపోయిన 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి.



**తొలి అక్షగారం/గణపురం,ఏప్రిల్29:**మండలంలోని చెల్పూర్ గ్రామంలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ లో మొదటి దశ 500 మెగావాట్ల ప్లాంట్ లో సోమవారం విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. సాంకేతిక లోపంతో బాయిలర్ ట్యూబులు లీకేజీ కావడంతో ఉత్పత్తి నిలిచిపోయినట్లు తెలిసింది. సాంకేతిక లోపాన్ని సరి చేసేందుకు జెన్కో ఇంజనీరింగ్ అధికారులు ముమ్మర ప్రయత్నం చేస్తున్నారు.

# మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే జిఎస్ఆర్



**తొలి అక్షరం/గణపురం,ఏప్రిల్29:**మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి గండ్ర భీమారావు ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సోమవారం వారి నివాసానికి చేరుకొని మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.